నేడు 'డయల్ యువర్ డీఎం'

నాగోలు: బండ్లగూడ డిపోలో శుక్రవారం 'డయల్ యువర్ డీఎం' కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఎం వెంకటేశం గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆర్టీసీ బస్సుల నిర్వాహణ, ప్రయాణికుల ఇబ్బందులు ఇతర అంశాలపై ఫిర్యాదు చేయాలంటే ఫోన్ నంబర్ 9959224058 లో సంప్రదించాలని ఆయన సూచించారు.

అక్బర్‌బాగ్‌లో ఎమ్మెల్యే పర్యటన



ఎమ్మెల్యేకు సమస్యలు విన్నవిస్తున్న కాలనీవాసులు

మలక్‌పేట: అక్బర్‌బాగ్ డివిజన్‌లోని ఆనంద్‌నగర్, దయానంద్‌నగర్‌లో ఎమ్మెల్యే అహ్మద్ బలాల గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా సీవరేజ్, స్ట్రీట్‌లైట్లు, పారిశుద్ధ్య, రోడ్లు తదితర సమస్యలను స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఆయన స్పందిస్తూ సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు. ఆయన వెంట స్థానిక కార్పొరేటర్ సయ్యద్ మినాజుద్దీన్, ఈఈ పీర్‌సింగ్, ఏఈ వెంకన్న, వాటర్ వర్క్స్ డీజీఎం అస్మత్ అలీ, మేనేజర్ అల్తాఫ్, నాయకులు నాగరాజు, సుమన్, మోహన్‌రాజ్ తదితరులు ఉన్నారు.

ఆస్తి పన్ను బకాయిలు వసూలు చేయాలి



అధికారులకు సూచనలు చేస్తున్న డీసీ జయంత్

చాదర్‌ఘాట్: ఆస్తి పన్ను బకాయిలు వసూలు చేయాలని సర్కిల్–6 డిప్యూటీ కమిషనర్ జయంత్ సూచించారు. మలక్‌పేటలో గురువారం ఆయన మాట్లాడుతూ.. ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, బిల్ కలెక్టర్లు సర్కిల్ పరిధిలో ఆస్తి పన్ను కోసం ఇచ్చిన చెక్కులు బౌన్స్ అయ్యాయని వారి వద్ద తిరిగి ఆస్తి పన్ను వసూలుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ఇకపై ట్రేడ్ లైసెన్స్‌ల జారీ లైసెన్స్ ఫీజులు కూడా వసూలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ, టీఐ, బిల్ కలెక్టర్ పాల్గొన్నారు.

బోనాల నిధుల కోసం దరఖాస్తు చేసుకోవాలి

చాదర్‌ఘాట్: బోనాల పండుగ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం అమ్మవారి ఆలయాలకు నిధులు మంజూరు చేస్తుందని దేవాదాయ శాఖ అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అర్హత గల ఆలయ కమిటీలు ఈనెల 25 లోగా దరఖాస్తులను బొగ్గులకుంటలోని దేవాదాయ శాఖ కార్యాలయంలో అందించాలని పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు కమిటీ లెటర్‌హెడ్, బ్యాంక్ ఖాతా వివరాలు, సభ్యుల ఆధార్ కార్డు పత్రాలు, ఆలయానికి సంబంధించి 3 ఫొటోలు, ప్రతి కాపీపై కమిటీ స్టాంపు ముద్రించి జతపర్చాలని కోరారు.

పరిసరాల శుభ్రతతోనే వ్యాధులు దూరం



మాట్లాడుతున్న ఏఎంహెచ్‌ఓ నరేశ్ నాయక్

చంపాపేట: పరిసరాల శుభ్రతతోనే వ్యాధులు ప్రబలకుండా ఉంటాయని సర్కిల్ ఏఎంహెచ్ఓ నరేశ్ నాయక్ అన్నారు. కర్మన్‌ఘాట్ ప్రభుత్వోన్నత పాఠశాల విద్యార్థులకు 'పరిసరాల శుభ్రత–దోమల నివారణ' పై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. అలాగే విద్యార్థులకు నీటి నిల్వ ప్రాంతాల్లో దోమలు అభివృద్ధి చెందే దశలను ప్రత్యక్షంగా చూపించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పద్మ, గణేశ్, సర్కిల్ సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాల అడ్మిషన్ల గడువు పెంపు

మహేశ్వరం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాల కోసం నిర్వహించే దోస్త్ అడ్మిషన్ల గడువును ఈ నెల 25 వరకు ప్రభుత్వం పొడిగించిందని ప్రిన్సిపాల్ డాక్టర్ సంగి రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వన మహోత్సవానికి సన్నద్ధం..!

- మలక్‌పేట సర్కిల్–6 అధికారుల కసరత్తు
- ప్రజా పంపిణీకి 30 వేల మొక్కలు
- ప్రభుత్వ స్థలాల్లో నాటేవి 2 వేలు



నర్సరీలో సిద్ధంగా ఉన్న మొక్కలు

చాదర్‌ఘాట్: వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో మలక్‌పేట సర్కిల్–6 అధికారులు వన మహోత్సవానికి సన్నద్ధమవుతున్నారు. మలక్‌పేట సర్కిల్–6 పరిధిలోని ఆరు డివిజన్లలో 30 వేల మొక్కలు నాటేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందు కోసం పార్కులు, కాలనీలు, ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాలు, ఆవరణ స్థలాలను ఎంపిక చేశారు. డివిజన్ల వారీగా నిర్వహించనున్న నేపథ్యంలో ఆయా ప్రాంత ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, కాలనీ సంక్షేమ సంఘాల సహకారం తీసుకునేందుకు కసరత్తు చేస్తున్నారు.

2 నర్సరీల్లో పెంపకం..

మలక్‌పేట జీహెచ్‌ఎంసీ సర్కిల్–6 పరిధిలో 2 డివిజన్లలో నర్సరీలు ఏర్పాటు చేశారు. కొన్ని రకాల మొక్కలకు ఇక్కడే అంట్లు గట్టి పెంచడంతో పాటు కొన్నిరకాల మొక్కలకు ఇతర నర్సరీల నుంచి దిగుమతి చేసుకుని ఇక్కడ సంరక్షిస్తున్నారు. ఇంటి ముందు ఆవరణలో ప్రజలు మొక్కలు నాటుకునేందుకు నిమ్మ, దానిమ్మ, కరివేపాకు, జామ, అల్ల నేరేడు మొక్కలు పంపిణీ చేయనున్నారు. ఇతర చోట్ల వేప, రావి, చింత, కానుగ, బాదం మొక్కలు నాటనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి కార్యక్రమాల టైం టేబుల్ ఖరారు కాగానే మొక్కల పంపిణీ ప్రారంభిస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

ప్రభుత్వ స్థలాలపై ప్రత్యేక దృష్టి..

సర్కిల్ పరిధిలో విశాలమైన మైదానాలు, పార్కులు లేవనే చెప్పాలి. దీంతో అధికారులు ప్రభుత్వ స్థలాలపై దృష్టి సారిస్తున్నారు. స్థానికంగా ఉన్న పార్కులు, శ్మశానవాటికలు, విశాలమైన రహదారులకిరువైపులా ప్రభుత్వ స్థలాల్లోనూ పెద్ద సంఖ్యలో మొక్కలు నాటనున్నారు.

పంపిణీ తీరు..

సర్కిల్–6 పరిధిలో 6 డివిజన్లలో అన్నిరకాల మొక్కలు కలిపి 30 వేల మొక్కలు నాటనున్నారు. డివిజన్‌కు 5 వేల చొప్పున మొక్కలు పంపిణీ చేయనున్నారు. ఇందులో 2 వేలు చిన్నతరహా 3 వేలు ఏపుగా పెరిగే మొక్కలు అందించనున్నారు. ఆరు డివిజన్లు కలిపి 30 వేల మొక్కలు నాటుతారు.

సంరక్షణకూ చర్యలు



మొక్కలు పెరిగేందుకు అనువైన స్థలాలు, సరిపోయే గుంతలను ఏర్పాటు చేస్తున్నాం. మొక్కలు నాటిన తర్వాత వాటి సంరక్షణకూ చుట్టూ కంచెలు ఏర్పాటు చేస్తాం. వన మహోత్సవాన్ని ప్రతిఒక్కరూ బాధ్యతగా భావించి మొక్కలు నాటి పెంచాలి.

– హార్టికల్చర్ అధికారి కిరణ్‌కుమార్

సింగరేణి గుడిసెవాసులకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలి



సైదాబాద్ తహసీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న శ్రీనివాస్

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధి సింగరేణి కాలనీలో మూడు దశాబ్దాలుగా నివసిస్తున్న గుడిసెవాసులకు అక్కడే ఇళ్ల పట్టాలు ఇవ్వాలని హైదరాబాద్ జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ కోట్ల శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు కాంగ్రెస్ నాయకులతో కలిసి సైదాబాద్ తహసీల్దార్ జయశ్రీని చంపాపేటలోని ఆమె కార్యాలయంలో గురువారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గుడిసెవాసులకు ఆధార్, ఓటర్, రేషన్ కార్డులు సహా ప్రభుత్వం నుంచి అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలు మంజూరయ్యాయన్నారు. సింగరేణి కాలనీపై కన్నేసిన కొందరు సొసైటీల పేరుతో ప్రభుత్వాన్ని, ఉన్నతాధికారులను తప్పు దారి పట్టిస్తున్నారని ఆరోపించారు. అవసరమైతే ఈ సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వారికి న్యాయం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐఎస్‌సదన్ డివిజన్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు నగారిగారి దాస్, లక్ష్మణ్‌రావు, బషీర్, గని, అలివేలు, కృష్ణవేణి, ఇందిర పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం



లింగయ్యగౌడ్‌కు అభినందిస్తున్న దృశ్యం

నాగోలు: ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామని సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యవర్గ సభ్యుడు, సరూర్‌నగర్ మండల కార్యదర్శి బాతరాజు నరసింహ అన్నారు. ఎల్‌బీనగర్ నియోజకవర్గంలోని చింతలకుంట శాఖ 16వ మహాసభను ఎల్‌బీనగర్‌లో గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ.. చింతలకుంట ఆయిల్ మిల్లు మెయిన్ రోడ్డు వద్ద వర్షం వచ్చినప్పుడు వరద నిలవడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం చింతలకుంట సీపీఐ కార్యదర్శిగా బి. లింగయ్యగౌడ్‌ను, సహాయ కార్యదర్శిగా ఎం. వెంకటయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఐ సరూర్‌నగర్ మండల సహాయ కార్యదర్శి బోయపల్లి రాములు గౌడ్, శోభా నరసింహ, వినోద్ , 11 మందితో కమిటీతో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

భారతి అల్ట్రాఫాస్ట్ తో నిర్మాణ ప్రక్రియ వేగవంతం



తాపీ మేస్త్రీలకు బీమా బాండ్లు అందజేస్తున్న టెక్నికల్ ఇంజనీర్ మొహినుద్దీన్ సాహెర్

హస్తినాపురం: భారతి అల్ట్రాఫాస్ట్‌తో నిర్మాణ ప్రక్రియ వేగవంతం అవుతుందని ఆ సంస్థ టెక్నికల్ ఇంజినీర్ మొహినుద్దీన్ సాహెర్ పేర్కొన్నారు. హస్తినాపురం జిల్లా పరిషత్ రోడ్డులోని భవానీ స్టీల్ అండ్ సిమెంట్ డీలర్ షాపులో గురువారం తాపీ మేస్త్రీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మార్కెట్‌లో లభించే ఇతర సిమెంట్‌తో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్ స్లాబులు, పిల్లర్లు, బ్రిడ్జిలు రహదారుల నిర్మాణాలకు సరైన ఎంపిక అని అన్నారు. తమ వినియోగదారులకు ఉచిత సాంకేతిక సహాయం అందిస్తామని అలాగే స్లాబ్ కాంక్రీట్ సమయంలో నిపుణులైన భారతి సిమెంట్ ఇంజినీర్లు సైట్‌వద్దకే వచ్చి సహాయపడతారని పేర్కొన్నారు. మార్కెట్లో లభించే ఇతర సిమెంట్లతో పోలిస్తే భారతి అల్ట్రాఫాస్ట్ రూ. 20 అధికంగా ఉంటుందన్నారు. అనంతరం తాపీ మేస్త్రీలకు రూ. లక్ష ప్రమాద బీమా బాండ్లను అందజేశారు. డీలర్ సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. భారతి సిమెంట్ సర్వీస్ చాలా ఫాస్ట్‌గా ఉంటుందన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ ఇంజినీర్లు, భారతి సిమెంట్ బృందం, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: మరమ్మతుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆటో మీటర్ సీల్ ఆఫీస్, సింగరేణి పార్క్, ఆదర్శనగర్ నాలా, సరస్వతీ శిశు మందిర్, సరూర్‌నగర్ చెరువు కట్ట, సింగరేణి కాలనీ గర్ల్స్ పీటీ పరిసర ప్రాంతాలు.

అలాగే మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 వరకు శంకేశ్వరబజార్, గ్రీన్ అపార్ట్‌మెంట్స్, సింగరేణి కాలనీ పెట్రోల్ పంప్, పీఅండ్‌టీ కాలనీ కల్లు కంపౌండ్ పరిసర ప్రాంతాల్లో కరెంట్ ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ షురూ



వైదేహినగర్‌లో ప్రారంభిస్తున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి, డీసీ యాదయ్య

ఎల్‌బీనగర్: డివిజన్ పరిధిలోని వైదేహినగర్, సచివాలయనగర్‌కాలనీల్లో బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి హయత్‌నగర్ సర్కిల్ డీసీ తిప్పర్తి యాదయ్యతో కలిసి గురువారం శానిటేషన్ స్పెషల్ డ్రైవ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాలనీల్లో పేరుకపోయిన మట్టి, చెత్తకుప్పలను తొలగింపు, రోడ్లను శుభ్రం చేయడం తదితర పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శానిటేషన్ డీఈ నీలిమా, కాలనీ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, సాంబశివరావు, బాబురావు, బాల్‌రెడ్డి, గోపాల్ రెడ్డి, శ్రీధర్‌కుమార్, కిషన్‌రావు, అచ్చయ్య, రామ్మోహన్‌చౌదరీ, వినేశ్, ఆదినారాయణ, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు కూతురు చికిత్సకు ఆర్థిక సాయం



హోంగార్డు వెంకటేశ్‌కు నగదు ఇస్తున్న ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి

చైతన్యపురి: సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా పనిచేస్తున్న వెంకటేశ్ కూతురు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ విషయం తెలుసుకున్న ఇన్‌స్పెక్టర్, ఎస్‌ఐలు, స్టేషన్ సిబ్బంది చికిత్స కోసం ఆర్థిక సాయం చేయాలని నిర్ణయించారు. వారు సేకరించిన రూ.79 వేలను గురువారం ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి చేతుల మీదుగా వెంకటేశ్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మరయ్య, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పాఠ్య పుస్తకాల అందజేత



నాగోలు: బండ్లగూడ ప్రాథమిక పాఠశాలలో గురువారం 'బాడి బాట' నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు అక్షరాభ్యాసం, పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. బండ్లగూడ గ్రామ కమిటీ అధ్యక్షుడు చెరుకు భవానీ శంకర్ గౌడ్, విద్యా కమిటీ చైర్మన్ ఎం అరుణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చెరుకు భవానీ శంకర్‌గౌడ్ మాట్లాడుతూ.. బడీడు పిల్లలను స్కూల్‌కు పంపించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ కమిటీ జనరల్ సెక్రెటరీ తూర్పాటి నారాయణ, ఉపాధ్యక్షుడు మెట్టు మురళీగౌడ్, ట్రెజరర్ సురేశ్ గౌడ్, నాగేల్లి సహదేవ్‌గౌడ్, పంగ గౌతం, కంది కంటి రాఘవేంద్ర గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్



డ్రాపౌట్ బాలలను పాఠశాలలో చేర్పించిన సేఫ్ ఫౌండేషన్ ప్రతినిధులు

సైదాబాద్: విద్యతోనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సేఫ్ ఫౌండేషన్ నిర్వాహకురాలు ప్రొఫెసర్ సుజాత సూరేపల్లి పేర్కొన్నారు. సింగరేణి కాలనీలో గురువారం ఆమె మాట్లాడుతూ.. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందు నుంచే తమ సంస్థ ప్రతినిధులు సింగరేణి కాలనీ తదితర బస్తీలకు చెందిన ప్రభుత్వ పాఠశాలల నుంచి డ్రాపౌట్ అయిన బాలలను గుర్తిస్తున్నారన్నారు. వారి తల్లిదండ్రులను కలిసి చిన్నారులను స్కూళ్లకు పంపించాలని కోరుతున్నామన్నారు. ఇప్పటివరకు 20 మంది చిన్నారులను శంకేశ్వరబజార్ ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో చేర్పించామని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రైమరీ స్కూల్ ప్రిన్సిపాల్ సతీశ్, ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ సుకన్య, ఫౌండేషన్ ప్రతినిధులు శ్రీను, కావేరి పాల్గొన్నారు.

నిరంతర యోగాతో మానసిక ప్రశాంతత

చంపాపేట: నిరంతర యోగా సాధనతో మానసిక ప్రశాంతత ఉంటుందని తద్వారా చదువుపై ఏకాగ్రత, ఆత్మస్థైర్యం పెరుగుతుందని విద్యావేత్త, విశ్రాంత ఉపాధ్యాయుడు లెక్కల కృష్ణారెడ్డి అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్ శ్రీసరస్వతీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యోగాపై శిక్షణ, అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యోగా సాధనకు వయోభేదం లేదని ప్రతిఒక్కరూ చేయవచ్చన్నారు. అనంతరం యోగా మాస్టర్ సుర్వి శ్రీరాముజీ విద్యార్థులతో యోగా ఆసనాలు వేయించారు.



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

ఘనంగా నల్లపోచమ్మ ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: మన్సూరాబాద్ డివిజన్ హయత్‌నగర్ పరిధిలోని బాలాజీనగర్‌కాలనీలో గల నల్లపోచమ్మ ఆలయ తృతీయ వార్షికోత్సవ వేడుకలు కొనసాగుతున్నాయి. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి గురువారం హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి సహకారం అందిస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, నాయకులు టంగుటూరి నాగరాజు, జక్కిడి రఘువీర్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, కృష్ణారెడ్డి, కాలనీవాసులు మోహన్‌రెడ్డి, హనుమంత్ రెడ్డి, యాదగిరిరెడ్డి, వెంకటేశ్వర్లు, కొండారెడ్డి, మధుసూదన్‌రెడ్డి, ప్రసాద్, జంగారెడ్డి, సంధ్య, కల్యాణి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

'యోగాంధ్ర–2025'లో డాక్టర్ సాదం ఐలయ్య



హస్తినాపురం: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని యోగాంధ్ర–2025 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నది. ఇందులో భాగంగా ఈనెల 17 నుంచి 20 వరకు కర్నూలులోని రాయలసీమ యూనివర్సిటీలో కొనసాగుతున్న వర్క్‌షాప్‌కు ఓయూ టెక్నాలజీ కళాశాల కెమికల్ డిపార్ట్‌మెంట్ అధ్యాపకుడు, హస్తినాపురం నందనవనంకాలనీకి చెందిన డాక్టర్ సాదం ఐలయ్య యోగా ట్రైనర్‌గా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యోగాఫర్ ఇన్నర్ పీస్ అండ్ సస్టైనబుల్ లివింగ్ అనే అంశంపై సూచనలు సలహాలు ఇచ్చినట్లు తెలిపారు. డాక్టర్ విశ్వనాథ్ మహాజన్ 'లైఫ్‌ఈస్ యోగా యోగా ఈస్ లైఫ్ అనే' అంశంపై ప్రసంగించారు.

రోడ్లపై వాహనాలు నిలిపితే చర్యలు



వాహనాలను తరలిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

హస్తినాపురం: రోడ్లపై అక్రమ పార్కింగ్‌లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని వనస్థలిపురం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భూపతి గట్టుమల్లు హెచ్చరించారు. విజయవాడ జాతీయ రహదారిపై ఆటోనగర్ నుంచి చింతల్‌కుంట వరకు ఉన్న సర్వీస్ రోడ్లపై గల వ్యాపార సముదాయల ఎదుట సర్వీస్ రోడ్లపై హహనాలను పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ పూర్తిగా స్తంభించి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని ప్రజల ఫిర్యాదు మేరకు ఆయన స్పందించి బుధవారం రాత్రి వాహనాలను సీజ్ చేసి క్రేన్‌ల సహాయంతో వనస్థలిపురం ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు సీఐ గట్టుమల్లు ఆధ్వర్యంలో తరలించారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

రంగారెడ్డి కోర్టులు: తీసుకున్న అప్పు తిరిగి ఇవ్వాలని అడిగినందుకు మేనత్తను హత్య చేసిన కేసులో నిందితుడు మద్దగోని రాజు (30)కు జీవిత ఖైదీతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.కర్ణకుమార్ తీర్పునిచ్చారు. కోర్టు ఏపీపీ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. వనస్థలిపురం ఠాణా పరిధిలో ఇంజాపూర్ గ్రామంలో ఎరుకల లక్ష్మమ్మ తన చిన్న కుమారుడితో కలిసి నివాసముండేది. అదే ప్రాంతంలో లక్ష్మమ్మ మేనల్లుడు రాజు కూడా ఉండేవాడు. ఇదిలా ఉండగా లక్ష్మమ్మ తన వద్ద తీసుకున్న డబ్బు తిరిగి ఇవ్వాలని రాజును అడిగింది. దీంతో విసిగిపోయిన రాజు 2024 ఫిబ్రవరి 17 ఇంట్లో ఎవరూ లేని సమయంలో లక్ష్మమ్మను ఇటుకలతో కొట్టి హతమార్చాడు. దీంతో మృతురాలి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని రిమాండుకు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షులను విచారించిన కోర్టు గురువారం నిందితుడికి శిక్ష ఖరారు చేస్తూ తీర్పు వెలువరించింది.

భూ సమస్యల పరిష్కారమే లక్ష్యం

మహేశ్వరం: భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం రైతు సదస్సులను నిర్వహిస్తోందని తహసీల్దార్ సైదులు అన్నారు. మండల పరిధిలోని దిలావార్‌గూడ, దుబ్బచర్ల గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన భూ భారతి చట్టంలో భాగంగా గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించి రైతుల సమస్యలపై దరఖాస్తులను స్వీకరించి వాటిని పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. దిలావార్‌గూడలో–7 దరఖాస్తులు, దుబ్బచర్లలో– 27 దరఖాస్తులు వచ్చాయని రెవెన్యూ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ నవత, సీనియర్ అసిస్టెంట్ పావని, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు స్వర్ణకుమారి, ప్రేమ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, ఇతర అధికారులు, రైతులు పాల్గొన్నారు.

నమస్తే ప్రాజెక్ట్‌పై అవగాహన

మీర్‌పేట: 100 రోజుల ప్రణాళికలో భాగంగా మీర్‌పేట మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నమస్తే ప్రాజెక్ట్ కార్యక్రమాన్ని కమిషనర్ జ్ఞానేశ్వర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వచ్ఛ ఆటో డ్రైవర్లు, హెల్పర్స్, స్క్రాప్ షాపు డీలర్స్, పారిశుద్ధ్య సిబ్బందికి ఆయుష్మాన్ భారత్ హెల్త్‌కార్డులు, ఈ–శ్రామ్ కార్డుల జారీతో పాటు పీపీఈ కిట్స్, శానిటేషన్ యంత్రాల కొనుగోలు, సబ్సిడీ రుణాలపై కమిషనర్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మేనేజర్ చంద్రప్రకాశ్‌రెడ్డి, ఆర్‌ఓ చంద్రశేఖర్‌రెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేశ్, నమస్తే ప్రోగ్రాం రాష్ట్ర కో–ఆర్డినేటర్ పి.యోగేశ్, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ చిన్నికృష్ణ పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌ల్లో కూరగాయల ధరల వివరాలు. టమాటా రూ.23, వంకాయ 23, బెండ 40, పచ్చిమిర్చి 45, కాకరకాయ 42, బీరకాయ 38, కాలీఫ్లవర్ 28, క్యాబేజీ 17, క్యారెట్ 40, దొండ 18, ఆలుగడ్డ 24, ఉల్లిగడ్డ 24, గోకరకాయ 40, దోసకాయ 18, సొరకాయ 11, పొట్లకాయ 23, అరటికాయ 11, చిక్కుడుకాయ 55, చామగడ్డ 28, మునగ 55, కందగడ్డ 45, బీట్‌రూట్ 25, కీర 35, బీన్స్ 65, క్యాప్సికమ్ 60.

ఆరు గ్యారంటీల పేరిట మోసం

మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి



క్యూబా కాలనీలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

పహాడీషరీఫ్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రజలకు ఆరు గ్యారంటీల పేరిట హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక మోసం చేస్తోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి మండిపడ్డారు. జల్‌పల్లి మున్సిపాలిటీలోని ఎర్రకుంట పరిసరాలు, షాహిన్‌నగర్ మర్కజ్, క్యూబాకాలనీలలో రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించిన బస్తీల్లో గురువారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో 20 ఏళ్ల క్రితం ఇళ్లు నిర్మించుకొని ఇంటి పన్ను, నల్లా, కరెంట్ బిల్లులు అన్ని చెల్లిస్తున్నా వారి ఇల్లు కూలుస్తామంటూ బెదిరింపు ధోరణితో సర్వేలు నిర్వహించడంతో స్థానిక మహిళలు నిద్రాహారాలు మానుకుంటున్నారన్నారు. సర్వే చేసేందుకు వచ్చిన అధికారులు కనీసం స్థానిక ఎమ్మెల్యేనైనా తనకైనా సమాచారం ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. రంగారెడ్డి జిల్లాలో ఖాళీ స్థలాలు కనిపిస్తే అధికారులే ముందస్తుగా అక్కడ వాలిపోతున్నారన్నారు. ఎవరూ కూడా అధైర్యపడొద్దని, తాను అండగా ఉంటానని ఈ సందర్భంగా ఆమె స్థానికులకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో జల్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్ బి.వెంకట్రామ్, బీఆర్‌ఎస్ సీనియర్ సూరెడ్డి కృష్ణారెడ్డి, షర్ఫొద్దీన్ హామెద్, అలీ మన్సూరీ, సయ్యద్ బదర్, మక్దూం పటేల్, పల్లపు శంకర్, యంజాల అర్జున్, అజీమ్ ఖాన్, ఫైసల్ ఖాన్, సలీం, ఆరీఫ్ అలీ పాల్గొన్నారు.